

బందవీధి ఆశ్రమ పాఠశాలలో ఘటనపై వివరాలను సేకరిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

గిరిజన బాలికల అదృశ్యంపై ఐటీడీఏ పీవో సీరియస్

- బందవీధి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, డిప్యూటీ మేట్రిన్, వర్కర్ సస్పెన్షన్
- ఘటనకు కారకులైన ఇద్దరు యువకులు, దుంబ్రిగుడ ఎంపీడీవో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌పై చట్టపరమైన చర్యలకు ఆదేశం

పాడేరు/జి.మాడుగుల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జి.మాడుగుల మండలం బందవీధి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు టెన్త్ గిరిజన బాలికలు అదృశ్యం ఘటనపై ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సీరియస్ అయ్యారు. దీంతో ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ బందవీధి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, డిప్యూటీ మేట్రిన్, హాస్టల్ వర్కర్‌ను సోమవారం సస్పెండ్ చేశారు. ఈ ఘటనకు కారకులైన ఇద్దరు యువకులు, దుంబ్రిగుడ ఎంపీడీవో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌పై చట్టపరమైన చర్యలకు ఆదేశించారు. బందవీధి ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు టెన్త్ విద్యార్థులు ఆగస్టు 27న అదృశ్యమై సెప్టెంబరు ఒకటిన పాడేరులో ప్రత్యక్షం కావడంపై బాలికల తల్లిదండ్రులు ఐటీడీఏ పీవో అభిషేక్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న ఐటీడీఏ పీవో దీనిపై విచారణ చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావును ఆదేశించారు. ఈ ఘటనపై ఆయన విచారణ చేపట్టి ఐటీడీఏ పీవోకు సమాచారం అందించడంతో ఐటీడీఏ పీవో అభిషేక్ బందవీధి ఆశ్రమ పాఠశాలను ఆదివారం రాత్రే సందర్శించి వాస్తవ విషయాలను గుర్తించారు.

హెచ్‌ఎం, డిప్యూటీ మేట్రిన్, వర్కర్ సస్పెన్షన్

బందవీధి బాలిక ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు టెన్త్ బాలికలు అదృశ్యమైన ఘటనపై శాఖాపరమైన చర్యలు చేపట్టడంలో భాగంగా హెచ్‌ఎం కె.సుమిత్ర, డిప్యూటీ మేట్రిన్ జానకి, హాస్టల్ వర్కర్ పద్మావతిలను సస్పెండ్ చేస్తున్నట్టు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. అలాగే ఈ ఘటనతో సంబంధం ఉన్న ఇద్దరు యువకులు చినబాబు, గోపిచంద్‌లతో పాటు దుంబ్రిగుడ ఎంపీడీవో కార్యాలయంలోని ... మిగతా 8వ పేజీలో

అటకెక్కిన ఆశ్రమాల నిర్వహణ

- గత వైసీపీ పాలనలో కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- అమ్మఒడి పేరుతో విద్యార్థులకు వసతులు దూరం చేసిన వైనం
- హెల్త్ వర్కర్లను తొలగించి వైద్యం అందించని దుస్థితి
- గత ఐదేళ్లలో లెక్కలేనన్ని మరణాలు
- ఆరుబయట భోజనాలు, స్నానాలు చేస్తున్న దయనీయ పరిస్థితి
- దుంబ్రిగుడ మండలం జాముగుడలో కలుషిత ఆహారం, జి.మాడుగుల మండలం బందవీధిలో ఇద్దరు బాలికల అదృశ్యం ఘటనలు నిర్లక్ష్యానికి నిదర్శనం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

మన్యంలోని గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఆశ్రమ పాఠశాలల నిర్వహణ అధ్వానంగా ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల నిర్వహణను గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్న ఆరోపణలు ఉన్నాయి.

ఏజెన్సీ వ్యాప్తంగా 117 ఆశ్రమ పాఠశాలల్లో 37 వేల మంది గిరిజన విద్యార్థులు 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. అయితే ఏడాదికో మారు అమ్మఒడిని అమలు చేస్తున్నామనే సాకుతో సాధారణ ప్రాథమిక పాఠశాలల వలే వీటిని సైతం కనీసం అభివృద్ధి, పర్యవేక్షణ లేకుండా వదిలేశారు. గతంలో ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా ప్రతి నెలా పాకెట్ మనీ, సబ్బులు, షాంపులు, పౌడర్, కొబ్బరి నూనె వంటి కాస్మోటిక్స్‌తో పాటు పెట్టెలు, జంబుఖానాలు, రగ్గులు, స్వెటర్లు, దుప్పట్లు, కంచాలు, గ్లాసులు వంటివి పంపిణీ చేసేవారు. అయితే అమ్మఒడి అమలు చేస్తున్నామనే కారణంతో వైసీపీ పాలనలో వాటి పంపిణీని పూర్తిగా రద్దు చేశారు. అలాగే ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వర్కర్లను సైతం తొలగించారు. దీంతో ఆశ్రమాల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించేందుకు ఎవరూ లేని దుస్థితి నెలకొంది. భోజన శాలలు లేక ఆరుబయట విద్యార్థులు భోజనాలు చేయడం, సోలార్ వాటర్ హీటర్లకు మరమ్మతులు చేసే దిక్కులేక చల్లని నీళ్లతోనే స్నానాలు చేయడం, సరిపడా మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన



జాముగూడ ఆశ్రమ పాఠశాలలో నీటి సమస్యకు అద్దంపడుతున్న దృశ్యం(ఫైల్)



బందవీధి బాలికల ఆశ్రమ పాఠశాల

పరిస్థితులు ఆశ్రమ పాఠశాలల్లో నిత్యకృత్యంగా మారాయి.

ఆశ్రమ పాఠశాలలపై అంతులేని నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలపై అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ వంటి ప్రజా ప్రతినిధులు మొదలుకుని ఐటీడీఏ పీవో, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ, మండల స్థాయిలో ఉండే ఏటీడబ్ల్యూవోలు, మండలాల్లో ఉండే స్కూల్స్ కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు సైతం ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణపై కనీసం దృష్టి సారించని పరిస్థితి కొనసాగింది. ఐటీడీఏ పీవోగా వి.అభిషేక్ బాధ్యతలు చేపట్టిన తరువాత నుంచి ఆశ్రమ పాఠశాలలపై అధికారులు కన్నెత్తి చూసిన పాపాన పోలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇదే అదనుగా టీడబ్ల్యూ డీడీ, ఏటీడబ్ల్యూవోలు, స్కూల్ కాంప్లెక్స్‌ల హెచ్‌ఎంలు సైతం ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణపై పెద్దగా దృష్టిపెట్టని పరిస్థితి నెలకొంది. కలెక్టర్‌గా ఏఎస్ దినేశ్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన తరువాత కొంత మేరకు మార్పు వచ్చి ఐటీడీఏ పీవో, టీడబ్ల్యూ డీడీ ఆశ్రమ పాఠశాలల వైపు అప్పుడప్పుడు చూస్తున్నారు. అయితే గత ఐదేళ్లలో ఆశ్రమ పాఠశాలల్లోని హెచ్‌ఎంలు, డిప్యూటీ వార్డెన్లు, మేట్రన్‌లుగా తమ వారిని నియమించుకున్నామనే ఆలోచనతోనే ప్రజాప్రతినిధులుండగా, తమకు రావాల్సిన కమీషన్లు అందితే చాలన్నట్టుగా ... మిగతా 8వ పేజీలో

జాముగుడ పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

దుంబ్రిగుడ: మండలంలోని జాముగుడ గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థినులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన సంఘటనపై ఐటీడీఏ పీవో అభిషేక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలో గత నెల 30న కలుషిత ఆహారం తిని 75 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ సంఘటనకు బాధ్యులను చేస్తూ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని, మేట్రిన్‌గా విధులు నిర్వహిస్తున్న సుజాతను సస్పెండ్ చేస్తూ ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీ చేశారు.

అనునిత్యం అప్రమత్తం

- కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయండి
- అవసరమైన మందులను అందుబాటులో ఉంచండి
- వృద్ధులు, గర్భిణులు, బాలింతలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి
- చింతూరు డివిజన్ అధికారులకు కలెక్టర్ ఆదేశం



టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చింతూరు డివిజన్ పరిధి లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని వీఆర్‌పురం, మండలంలోని రామగిరి పంచాయతీ పరిధిలో రామగిరి, చొక్కంపల్లి, కొత్తూరు, అల్లూరు, రామవరం పంచాయతీ రామవరం, ఏపీగూడెం, చినమోకపల్లి పంచాయతీలో చింతరేవుపల్లి, గుండుగూడెం తదితర గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్నందున ఆయా గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే గోదావరి, శబరి నదులకు 9 లక్షల క్యూసెక్కుల నీరు చేరే అవకాశం ఉన్నందున తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, గోదావరి 35 అడుగులు దాటితే పలు రహదారులు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. గ్రామస్థాయి అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన నిత్యావసర సరకులు సిద్ధం చేసుకుని పంపిణీ చేయాలన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు అప్రమత్తంగా ఉంటూ అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే వృద్ధులు, గర్భిణులు, బాలింతలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, చింతూరులో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి గంటకు వాటర్ లెవల్ పరిశీలించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. విద్యుత్ సమస్యలు ఏర్పడితే వెంటనే పరిష్కరించాలని, వరద సహాయక చర్యలు, ఇతర సంఘటనల సమాచారం సకాలంలో అందించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అమిత్‌బర్దార్, జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

తెరిపిచ్చిన వాన

అల్పపీడన ప్రభావం నేపథ్యంలో ఎట్టకేలకు నాలుగు రోజుల తరువాత వర్షం తెరిపిచ్చింది. జిల్లా వ్యాప్తంగా సోమవారం జల్లులు మినహా పెద్దగా వర్షం కురవలేదు. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని ప్రాంతాల్లోనూ జల్లులు మాత్రమే పడ్డాయి.

భారీగా రైళ్ల రద్దు

జాబితాలో జన్మభూమి, రత్నాచల్, గోదావరి ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్, ఏపీ ఎక్స్‌ప్రెస్, ఉదయ్ ఎక్స్‌ప్రెస్, విశాఖ ఎక్స్‌ప్రెస్, కోరమండల్..

నేటి నుంచి 7వ తేదీ వరకూ పలు సర్వీసులు క్యాన్సిల్ 7

జడ్పీ సీఈవో పోస్టుకు పోటీ

పలువురికి ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు

- నేతల మధ్య అంతరం
- మంత్రి లోకేశ్ దృష్టికి వ్యవహారం
- కీలక మండలాల ఎంపీడీవో పోస్టులకూ డిమాండ్
- ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్న వైనం

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): **జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) పోస్టుకు పలువురు అధికారులు పోటీపడుతున్నారు. ఇప్పటికే ప్రజా ప్రతినిధులు కొందరి అధికారుల పేర్లను సిఫారసు చేస్తూ లేఖలు ఇచ్చారు. ప్రస్తుత సీఈవో పోలి నాయుడు వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్నాయుడుకు ఓఎస్‌డీగా వెళ్లడంతో డిప్యూటీ సీఈవో సత్యనారాయణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ దశలో సీఈవోగా వచ్చేందుకు 1999, 2007 బ్యాచ్‌కు చెందిన ఎంపీడీవోలు పోటీ పడుతున్నారు.**

జడ్పీ సీఈవో పోస్టు కోసం ఉమ్మడి జిల్లాలో పలువురు ప్రజా ప్రతినిధులు సిఫారసు లేఖలు ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఏపీఐఐసీలో పనిచేసి, ఆరోపణలు ఎదుర్కొన్న అధికారిని గ్రామీణ ప్రాంతానికి చెందిన కీలక ప్రజా ప్రతినిధి సిఫారసు చేయడం దుమారం రేపుతోంది. దీనిపై నాలుగు రోజుల క్రితం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి నారా లోకేశ్‌కు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఫిర్యాదు చేశారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజా ప్రతినిధులంతా ఒక మాట అనుకుని, సమర్థుడైన అధికారిని సిఫారసు చేస్తే వివాదం ఉండేది కాదు. అలాకాకుండా దాదాపు ముగ్గురి నుంచి నలుగురికి ప్రజా ప్రతినిధులు సిఫారసు లేఖలు ఇచ్చారు. ఏం జరుగుతుందో చూడాలి. సీఈవో పోస్టు వ్యవహారం ప్రజా ప్రతినిధుల మధ్య అంతరం పెంచిందని టీడీపీ వర్గాల అభిప్రాయం.



ఎంపీడీవో పోస్టులకూ పోటీ..

ఉమ్మడి జిల్లాలో 39 మండలాలు ఉండగా పెందుర్తి, దేవరాపల్లి, కె.కోటపాడు, వి.మాడుగుల, మాకవరపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాయకరావుపేట, చోడవరం, చీడికాడ, గొలుగొండ, నర్సీపట్నం, రోలుగుంట, సబ్బవరం, ఆనందపురం ఎంపీడీవోలు ఒకేచోట ఐదేళ్ల అంతకంటే ఎక్కువ సర్వీసు పూర్తిచేసుకున్నారు. ఖాళీగా ఉన్న ఐదు మండలాలకు ఎంపీడీవోలను నియమించాల్సి ఉంది. ఒకేచోట ఐదేళ్లకు పైగా పనిచేసిన అధికారులకు బదిలీ చేయాలని గత నెలలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో స్పష్టంచేస్తోంది. ఇంకా బదిలీలకు జీరో సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. దీని ప్రకారం పాయకరావుపేట, చోడవరం, చీడికాడ, గొలుగొండ, నర్సీపట్నం, రోలుగుంట, సబ్బవరం, ఆనందపురం తదితర ఎనిమిది మండలాల ఎంపీడీవోలు విధిగా బదిలీ కావాల్సిందే. ఐదేళ్ల కంటే తక్కువ సర్వీసున్న 12 మంది ఎంపీడీవోలు, అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాకు రావాలని తొమ్మిది మంది ఎంపీడీవోలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎక్కువ మండలాల్లో ... మిగతా 8వ పేజీలో

జ్వరంతో గిరిజనుడి మృతి

- గొల్లపల్లిలో మరో పది మంది జ్వర పీడితులు
- గత నెలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి హడావిడి
- మర్నాడు నుంచి పట్టించుకోని వైద్యులు



శ్రీనుబాబు మృతదేహం

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 2: మండలంలోని అమ్మవారి ధారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో ఓ గిరిజనుడు జ్వరంతో మృతి చెందాడు. గ్రామంలో మరో పది మంది ఆదివాసీలు జ్వరాలతో బాధపడుతున్నారు. గొల్లపల్లి గ్రామంలో వారం రోజుల క్రితం ఆదివాసీలు జ్వరాల బారిన పడ్డారు. దీనిపై గత నెల 28వ తేదీన 'జ్వరాల విజృంభణ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమాల్ బాషా ఆదేశాల మేరకు సప్పర్ల వైద్యాధికారి బి.ఈశ్వర సందీప్ 29వ తేదీన వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వర పీడితులకు చికిత్స చేశారు.

అయితే ఆ మర్నాడు నుంచి ఇప్పటి వరకు వైద్య సిబ్బంది ఆ గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఈ క్రమంలో నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న కాకూరి శ్రీనుబాబు(27) ఆదివారం రాత్రి మృతి చెందాడు. వైద్యులు చికిత్స కొనసాగించకపోవడం వల్లే శ్రీనుబాబు మృతి చెందాడని ఆదివాసీలు చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో సుమారు పది మంది జ్వరాలతో బాధపడుతున్నారని, వీరికి మెరుగైన చికిత్స అందించాలని వారు కోరుతున్నారు.

కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటయ్యేనా?

- వైసీపీ ప్రభుత్వ హయాంలో హడావిడిగా పనులు ప్రారంభం
- పిల్లర్ల దశ దాటని నిర్మాణాలు
- నిధులు విడుదల చేయకుండా శంకుస్థాపన చేయడంపై తీవ్ర విమర్శలు
- ప్రజలను మభ్యపెట్టేందుకేనని ఆరోపణలు



సమీకృత కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌కు కేటాయించిన స్థలంలో పది నెలలుగా పిల్లర్ల స్థాయి దాటని నిర్మాణాలు

కొయ్యూరు, సెప్టెంబరు 2: మండలంలోని డౌనూరులో సమీకృత కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు పడకేశాయి. గత ఏడాది అక్టోబరులో అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అట్టహాసంగా భూమి పూజ చేసి పదకొండు నెలలు గడిచినా పిల్లర్ల దశను దాటలేదు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టుకునేందుకు నిధులు మంజూరు చేయకుండా శంకుస్థాపన చేసిందనే వాదన వినిపిస్తోంది.

మండలంలో డౌనూరు కేంద్రంగా గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో రూ.4 కోట్లతో సమీకృత కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి గత ఏడాది అక్టోబరు 20వ తేదీన అప్పటి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి రాజన్నదొర అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. రానున్న ఆరు నెలల్లో దీనిని పూర్తి చేస్తామని ప్రకటించారు. అయితే మంత్రి ప్రకటించిన కాలపరిమితి పూర్తయినా కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ పనులు పిల్లర్లకే పరిమితమయ్యాయి. ఇది పూర్తయితే కాఫీ రైతులు దళారుల బారిన పడకుండా నేరుగా జీసీసీకి అమ్మకాలు జరిపి గిట్టుబాటు ధర పొందే అవకాశం ఉండేది. అంతేకాకుండా కాఫీ పల్పింగ్, రోస్టింగ్, ప్యాకింగ్ తదితర పనుల ద్వారా స్థానిక మహిళలకు ఉపాధి ఏర్పడేది. అయితే ఈ యూనిట్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు లేకుండానే శంకుస్థాపన చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిధులు లేకుండా గిరిజనులను మభ్యపెట్టేందుకు ఈ శంకుస్థాపన చేశారని అంటున్నారు. అలాగే కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణాల ప్లాన్ విషయంలో జాప్యం జరిగిందని జీసీసీ అధికారులు చెబుతున్నారు. యంత్రాల ఏర్పాటుకు అనుగుణంగా నిర్మాణాలు చేయించేందుకు ప్లాన్ అప్రూవల్ అయిందని వారు తెలిపారు. త్వరలో పనులు జరిగే అవకాశం ఉందని అంటున్నారు. అయితే నిధుల విషయాన్ని ప్రస్తావిస్తే సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. కూటమి ప్రభుత్వం కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కాఫీ రైతులు కోరుతున్నారు.

కోలుకుంటున్న విద్యార్థినులు

అరకులోయ ఏరియా ఆస్పత్రి నుంచి మరో 12 మంది డిశ్చార్జి... మరికొందరికి చికిత్స 7లో..

అంగన్‌వాడీలు గ్రామాలను దత్తత తీసుకోవాలి

- దీనివల్ల చక్కని ఫలితాలు వస్తాయి
- కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచన
- ఘనంగా పౌష్టికాహార మాసోత్సవం

పాడేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు తాము పని చేస్తున్న గ్రామాన్ని దత్తత తీసుకుని అవసరమైన సేవలను మెరుగ్గా అందించాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సూచించారు. స్థానిక కాఫీ హౌస్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పని చేసే చోట అందరితో చక్కని సంబంధాలు కలిగి ఉంటారని, ఈ క్రమంలో ఆ ప్రాంతాన్ని దత్తత తీసుకుని సేవలు అందిస్తే చక్కని ఫలితాలు వస్తాయన్నారు. అలాగే మాసోత్సవంలో భాగంగా ఈ నెల 1 నుంచి 30 వరకు క్షేత్ర స్థాయిలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారంపై ప్రజల్లో చక్కని అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మాతా శిశు మరణాలు చోటు చేసుకోకుండా అంగన్‌వాడీలు మరింత మెరుగైన సేవలు అందించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలని, కౌమార దశ పిల్లల ఆరోగ్య పోషణపై దృష్టి సారించాలన్నారు. పారా మెడికల్ సిబ్బందితో సమన్వయం చేసుకుని గ్రామాల్లో పోషకాహార, ఆరోగ్య సేవలందించాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, డీఈవో పి.బ్రహ్మాజిరావు, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల డీటీ ప్రశాంత్‌కుమార్, పాడేరు డివిజన్ పరిధిలోని సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ చెరువులో పడి రైతు మృతి


మృతుడు సుర్ల అచ్చియ్యనాయుడు(ఫైల్ ఫొటో)

రోలుగుంట, సెప్టెంబరు 2: మండలంలోని జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన ఓ రైతు ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతిచెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ సురేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన సుర్ల అచ్చియ్యనాయుడు అనే రైతు ఆదివారం సాయంత్రం తన గేదెను కడగడానికి సమీపంలో ఉన్న ఎర్ర చెరువుకు తీసుకువెళ్లాడు. చెరువు లోపలికి వెళ్లిన గేదె ఊబిలో పడిపోవడంతో దాన్ని రక్షించే క్రమంలో అతను మృతి చెందాడు. అలాగే గేదె కూడా మృతి చెందింది. అచ్చియ్యనాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. అతని భార్య రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జీడిమామిడి తోటల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహం

కొత్తూరు, సెప్టెంబరు 2: అనకాపల్లి మండలంలో కోడూరు శివారు వున్న జీడిమామిడి తోటల్లో గుర్తు తెలియని మహిళ కళేబరాన్ని సోమవారం గుర్తించినట్టు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. సబ్బవరం మండలానికి చెందిన రాపర్తి అప్పారావుకు అనకాపల్లి మండలం కోడూరులో జీడిమామిడి తోట ఉంది. వేసవిలో జీడి పిక్కలు ఏరిన తరువాత ఆయన తోటల్లోకి రాలేదు. మూడు నెలల తరువాత సోమవారం జీడిమామిడి తోటకు వెళ్లాడు. ఇక్కడ ఒక కళేబరం కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, వైద్యుల సహాయంతో కళేబరాన్ని మహిళదిగా గుర్తించారు. కళేబరాన్ని పరీక్షల నిమిత్తం విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించామని, మృతురాలి వయసు 55-60 ఏళ్లు వుంటాయని ఎస్ఐ చెప్పారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు: ఎస్పీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

అనకాపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం ప్రజలు అందిస్తున్న ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి జాప్యం చేయవద్దని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరై పలువురి నుంచి ఫిర్యాదులు/ వినతులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ఆమె స్వయంగా మాట్లాడారు. ఫిర్యాదులపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ దేవప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐ దివ్య తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం

కొయ్యూరు, సెప్టెంబరు 2: రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆదివారం అర్ధరాత్రి సుమారు 10 అడుగుల పొడవైన కొండచిలువ హల్‌చల్ చేసింది. ఆ సమయంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది వసతి గృహాల్లోకి కొండచిలువ చొరబడి రోగులతో పాటు సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసింది. రోగులతో పాటు సిబ్బంది సుమారు గంట సేపు శ్రమించి కొండచిలువను హతమార్చారు.


హతమైన కొండచిలువ

భారీగా రైళ్ల రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీగా కురిసిన వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో రైల్వే లైన్లు పాడయ్యాయి. విజయవాడ డివిజన్‌లో ముమ్మరంగా జరుగుతున్న రైల్వే లైన్ల అభివృద్ధి పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. పలుచోట్ల రైలు పట్టాలపై వరద నీరు ప్రవహించడం, ఇంకొన్ని ట్రాక్‌లు పాడవ్వడంతో విశాఖ నుంచి, విశాఖ మీదుగా వెళ్లే అనేక రైళ్లను వాల్తేరు డివిజన్ అధికారులు రద్దు చేశారు. ఆదివారం నుంచి మొదలైన రైళ్ల రద్దు మంగళవారం కూడా కొనసాగుతుందని రైల్వే వర్గాలు తెలిపాయి.

మంగళవారం విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ (12739), విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ (20708), విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ (20833), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), విశాఖ-మహబూబనగర్ సూపర్‌ఫాస్ట్ (12861), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ (20707), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ (20834), సికింద్రాబాద్-షాలిమార్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12774), మహబూబ్‌నగర్-విశాఖ సూపర్‌ఫాస్ట్ (12862), తిరుపతి-విశాఖ ప్రత్యేక రైలు (08584), ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమార్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (12842), లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016), హైదరాబాద్-కటక్ ప్రత్యేక రైలు (07165), బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12864) రద్దు చేశారు. 4న (బుధవారం) షాలిమార్-సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12773), న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806), ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), తంబరం-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22842), ఎర్నాకులం-హటియా ధార్తి ఏసీ ఎక్స్‌ప్రెస్ (22838), కటక్-హైదరాబాద్ ప్రత్యేక రైలు (07166), 5న ఎర్నాకులం-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (18189), 6న హౌరా-మైసూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22817), కొచువేలి-షాలిమార్ ప్రత్యేక రైలు (06081), 7న కన్యాకుమారి-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12666), తిరువేలి-పురిలియా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22606)లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

మళ్లింపు మార్గంలో; మంగళవారం విశాఖ నుంచి న్యూఢిల్లీ వెళ్లే ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805) వయా విజయనగరం, రాయగడ, రాయపూర్, నాగపూర్ మీదుగా, హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728) వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడుస్తాయి.

విశాఖ నుంచి వెళ్లే 12 రైళ్లు, విశాఖ మీదుగా వెళ్లే 19 రైళ్లు రద్దయ్యాయి. దాంతో ముందుగానే ప్రయాణాలు పెట్టుకున్నవారు, ఇతర ప్రాంతాల నుంచి విశాఖపట్నం వచ్చి, ఇక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లాలనుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం ముందుగా తెలుసుకున్నవారు ప్రయాణాలు రద్దు చేసుకోవడంతో విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఖాళీగా ఉంది. ఏ రైళ్లు రాకపోవడంతో ప్లాట్‌ఫారాలు బోసిపోతున్నాయి. ఇతర రైళ్లలో వచ్చి, మరో రైలు ఎక్కాల్సినవారు గత్యంతరం లేక ప్లాట్‌ఫారంపై కూర్చొని కాలక్షేపం చేస్తున్నారు.

నేడు విశాఖ నుంచి విజయవాడకు ప్రత్యేక రైలు

పలు రైళ్లు రద్దు అయిన నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం మంగళవారం విశాఖ నుంచి విజయవాడకు (ఒక వైపు) ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08581 నంబర్‌తో ఈ రైలు మధ్యాహ్నం 12.55 గంటలకు విశాఖలో బయలుదేరి రాత్రి 7.15 గంటలకు విజయవాడ చేరుతుందన్నారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ నడిచే సమయంలో బయలుదేరే ఈ ప్రత్యేక రైలు 16 సెకండ్ క్లాస్ సిట్టింగ్, రెండు జనరల్ సెకండ్ క్లాస్, రెండు ఏసీ చైర్‌కార్, రెండు సెకండ్ క్లాస్ కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లతో నడుస్తుందన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

శిథిలావస్థలో పురాతన వంతెన


శిథిలావస్థకు చేరిన వంతెన మీదుగా వెళుతున్న ఒక పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు. (ఇన్‌సెట్‌లో) శిథిలావస్థకు చేరిన పురాతన వంతెన

- రామచంద్రపురం వద్ద వందేళ్ల క్రితం నిర్మాణం
- మరమ్మతులకు నోచుకోకపోవడంతో బలహీనంగా మారిన వారధి
- ఇప్పటికే ఒకవైపు కుంగిపోయి, బీటలు వారిన పిల్లర్లు
- ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన
- కొత్త వంతెన నిర్మించాలని అధికారులకు వినతి


వంతెన వద్ద బస్సు దిగి... నడుచుకుంటూ వెళుతున్న ప్రయాణికులు

కోటవురట్ల, సెప్టెంబరు 2: మండలంలోని రామచంద్రపురం వద్ద నర్సీపట్నం- అడ్డరోడ్డు ప్రధాన రహదారిపై వున్న పురాతన వంతెన శిథిలావస్థకు చేరి, ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు, ఈ మార్గంలో ప్రయాణించే వారు ఆందోళన చెందుతున్నారు. సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వంతెనకు ఎటువంటి మరమ్మతులు చేయకపోవడంతో బలహీనంగా మారింది. వంతెన మీదగా భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తూ ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టినా... ఎవరూ పట్టించుకోవడం లేదు. 40 నుంచి 50 టన్నుల బరువుతో టిప్పర్ లారీలు వెళుతున్నాయి. గతంలో అధిక లోడుతో ట్రిప్పర్ లారీ వెళ్లడంతో వంతెన ఒకవైపు కుంగిపోయి, శ్లాబ్, పిల్లర్లు బీటలు వారాయి. శ్లాబ్‌కింద వేసిన ఇనుప కమ్మెలు ఒగిపోయాయి. ఇదిలావుండగా మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో వంతెన మరింతా బలహీనంగా మారింది. దీంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్లు.. ఈ వంతెనకు ముందు ప్రయాణికులను దించి, ఖాళీ బస్సును వంతెన దాటిస్తున్నారు. తరువాత ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వరిపైరుకు సకాలంలో పొటాష్ ఎరువు

- తెగుళ్లను తట్టుకొనే శక్తి పెరుగుతుంది
- ఎలమంచిలి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి


మామిడివాడ వద్ద వరి పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

ఎలమంచిలి/రాంబిల్లి, సెప్టెంబరు 2: వరినాటిన 30 రోజులలోపు ఎకరాకు 20 నుంచి 25 కిలోల పొటాష్ ఎరువును తప్పనిసరిగా వేసుకోవాలని, ఇదే సమయంలో యూరియా ఎరువును మోతాదుకు మించి వాడితే చీడపీడల ఉధృతి పెరిగే ప్రమాదం వుందని ఎలమంచిలి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి అన్నారు. సోమవారం ఎలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మామిడివాడ, చినకలవలాపల్లి, సోమలింగపాలెం, కట్టుపాలెం, జంగులూరు, వెలమపాలెం, వేమగిరి, సైతారుపేట గ్రామాల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటించి వరి పొలాలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సబ్‌డివిజన్ పరిధిలో వరినాట్లు 70 శాతం మేర పూర్తయ్యాయని, మరో పక్షం రోజుల వరకు వరినాట్లు వేసుకోవచ్చని చెప్పారు. ఒకవేళ నారు ముదిరిపోతే.. చిగుళ్లను తుంచి నాటుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం వరినాట్లు పిలక దశలో వున్నాయని, సాలి పురుగులు, అక్షింతల పురుగులు, తూనీగలు వంటి మిత్ర పురుగులు అధికంగా ఉన్నందున వారం, పది రోజుల వరకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. ఎకరాకు పది చోట్ల పక్షిస్థావరాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆకుముడత తెగులు ఉధృతిని తగ్గించవచ్చునన్నారు. వరిపైరుకు అవసరమైన మోతాదులో పొటాష్ ఎరువును రైతులు వాడడం లేదని, వరినాటిన నెల రోజుల్లో పొటాష్ ఎరువు వేస్తే.. మొక్కలకు తెగుళ్లను తట్టుకొనే శక్తి పెరుగుతుందని ఆమె తెలిపారు. ఇందుకు అవసరమైన జీవన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో సగం ధరకే అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ భూసార ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ఎస్ రామలక్ష్మి, బీసీటీ కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్, ఎలమంచిలి వ్యవసాయ శాఖ ఏడీ బి.ప్రభాకరరావు, అధికారులు సుమంత, పి.మోహన్‌రావు, సంతోషి, వీఏవోలు దేవతి, దివ్య ప్రసన్న, అభ్యుదయ, తదితరులు పాల్గొన్నారు.


వరి నాట్లు వేస్తున్న రైతులకు సూచనలు ఇస్తున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భవాని

నీట మునిగిన వరి పొలాలు.. శాస్త్రవేత్తల సందర్శన

నక్కపల్లి, సెప్టెంబరు 2: అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భవానీ, బీసీటీ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా, శాస్త్రవేత్త ప్రసాదరావు సోమవారం నక్కపల్లి మండలంలోని కాగిత, ఉద్దండపురం, గొడిచెర్ల గ్రామాల్లో వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. పొలాల్లో నుంచి నీటి త్వరగా బయటకు పంపే ఏర్పాటు చేసుకోవాలని, ఎకరాకు 20 కిలోల చొప్పున పొటాష్, యూరియా ఎరువురు వేసుకోవాలని సూచించారు. వీరి వెంట పాయకరావుపేట వ్యవసాయశాఖ ఏడీ ఉమాప్రసాద్, వీఏఏ రాకేశ్, ఏఈవో సత్యనారాయణ వున్నారు.

కోలుకుంటున్న విద్యార్థినులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల వద్ద తల్లిదండ్రులు

అరకులోయ, సెప్టెంబరు 2: డుంబ్రిగుడ మండలం జాముగుడ గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు కోలుకుంటున్నారని, సోమవారం మరో 12 మందిని డిశ్చార్జి చేశామని అరకులోయ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాము తెలిపారు. ఆ పాఠశాలలో కలుషిత ఆహారం తిని 75 మంది విద్యార్థినులు శుక్రవారం అస్వస్థతకు గురికాగా, అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేసి ఆదివారం 54 మందిని డిశ్చార్జి చేసిన విషయం తెలిసిందే. మిగతా వారికి చికిత్స అందిస్తున్నామని ఆయన తెలిపారు. వారి ఆరోగ్యం బాగానే ఉందని, అయితే నీరసంగా ఉండడంతో ఆస్పత్రిలో ఉంచామని, ఒకట్రెండు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని ఆయన చెప్పారు.

విజయవాడ వరద బాధితులకు 1.5 లక్షల ఆహార ప్యాకెట్లు


పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరదలకు చిక్కుకున్న విజయవాడ ప్రజలకు 1.5 లక్షల ఆహార ప్యాకెట్లు సరఫరా చేసేందుకు కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు సిబ్బందితో కలిసి ఆహారం తయారీలో నిమగ్నమయ్యారు. మంగళవారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాల కోసం మూడు రకాల ఆహార పదార్థాలు సిదం చేశారు. టిఫిన్, పులిహోర, వెజ్ బిర్యానీ ప్యాకెట్లను సింహాచలం దేవస్థానం, అక్షయపాత్రతోపాటు మరికొన్ని ప్రైవేటు కేటరింగ్ సంస్థలు సిద్ధం చేశాయి. వీటిని సోమవారం రాత్రి ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో తరలించేందుకు రైల్వేశాఖ ఒక బోగీ కేటాయించింది.

మహిళ పొట్టలో ఎముకల గూడు

- శస్త్రచికిత్స ద్వారా తొలగించిన కేజీహెచ్ వైద్యులు


తొలగించిన ఎముకల గూడు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జ్ ఆస్పత్రిలోని గైనకాలజీ విభాగానికి చెందిన వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించారు. మహిళ పొట్టలో పేగులు చుట్టూ ఏర్పడిన ఎముకల గూడును శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ఈ తరహా కేసులు ఇప్పటివరకూ దేశంలో 25 వరకు మాత్రమే నమోదయ్యాయని, విశాఖలో తొలిసారి ఇటువంటి శస్త్రచికిత్సను నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లాకు చెందిన 27 ఏళ్ల మహిళ గతంలో ఇద్దరికి జన్మనిచ్చింది. మూడేళ్ల కిందట మరోసారి గర్భం దాల్చింది. పిల్లలు వద్దనుకున్న ఆమె అబార్షన్ నిమిత్తం మందులు వినియోగించారు. అబార్షన్ అయినట్టు ఆమెకు వైద్యులు చెప్పారు. అయితే, అప్పటి నుంచి సదరు మహిళ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ వస్తోంది. ఎంతమంది వైద్యులకు చూపించినా పరిష్కారం లభించలేదు. కొద్దిరోజుల కిందట కేజీహెచ్‌కు వచ్చిన ఆమెకు వైద్యులు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించారు. ఈ స్కానింగ్‌లో కడుపులో కణితిని గుర్తించారు. పూర్తిస్థాయిలో స్పష్టత కోసం ఎంఆర్ఐ స్కానింగ్ చేయించగా, 24 వారాలు శిశువుకు సంబంధించిన ఎముకల గూడు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. దీనినే వైద్య పరిభాషలో లిథోపెడియన్ (శిశువు ఎముకలగూడు)గా పేర్కొంటారని కేజీహెచ్ గైనిక్ విభాగం మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ఈ నేపథ్యంలో ఐ.వాణి, మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆనంద్ సహకారంతో శస్త్ర చికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్యులను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద అభినందించారు. ఆమె ఆరోగ్యంగా ఉందని, కోలుకుందని డాక్టర్ ఐ.వాణి తెలిపారు. మంగళవారం డిశ్చార్జ్ ఇస్తామన్నారు. అత్యంత అరుదుగా ఇటువంటి కేసులను చూస్తుంటామన్నారు.

వర్షాలతో జనం ఇబ్బంది పడకూడదు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన అధికారులు

- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు క్షేత్ర పర్యటనలు నిర్వహించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో వర్షాలు, నష్టాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాలతోపాటు వ్యాధులు ప్రబలే అవకాశాలు వున్నందున పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో మురుగు కాలువల నిర్వహణ పనులు పక్కాగా జరగాలన్నారు. సురక్షిత తాగునీరు సరఫరా చేయడంతో పాటు పైపులైన్‌లు ఎక్కడా లీకేజీలు లేకుండా చూడాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు, ఇళ్లు కూలిపోవడం వంటివి జరిగితే తక్షణమే స్పందించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు తగిన సూచనలు చేసి, పంట నష్టపోకుండా చూడాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. అధిక వర్షాల వల్ల కలిగిన నష్టాలపై నివేదికలు రూపొందించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ బి.దయానిధి, ఆర్డీఓలు చిన్నికృష్ణ, జయరామ్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో భద్రతా చర్యలు చేపట్టాలి

సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వసతిగృహాల్లో మౌలిక వసతులు, విద్యార్థుల భద్రత విషయంలో రాజీ పడవద్దన్నారు. ముఖ్యంగా బాలికలను వసతిగృహాల నుంచి నుంచి బయటకు పంపాల్సి వస్తే, తప్పనిసరిగా ఎస్కార్ట్‌ను తోడుగా పంపాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వార్డెన్లు చెప్పాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు వసతిగృహాల్లో అందుబాటులో ఉండకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మెనూను సక్రమంగా అమలు చేయాలని, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో బీసీ వెల్ఫేర్ ఈడీ కె.రాజేశ్వరి, డీటీడబ్ల్యూఓ నాగశిరీషా, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కోఆర్డినేటర్ రూపవతి, వార్డెన్లు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెరగాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం విద్యా శాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యే చూడాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. విద్యార్థులు తాగడానికి వేడిచేసి చల్లార్చిన నీటిని అందుబాటులో వుంచాలని చెప్పారు. ఈ సమావేశంలో డీఈఓ ఎంవీ లక్ష్మమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలు పాల్గొన్నారు.

అయోధ్య రాముని ధనస్సుకు ప్రత్యేక పూజలు


ధనస్సుకు పూజలు చేసిన భక్తులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 2: రామజన్మభూమి అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తికి అందజేసే ధనస్సు, బాణానికి స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య భాగ్యనగర్ సీతారామ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు చల్లా శ్రీనివాసశాస్త్రి దేశవ్యాప్త ఊరేగింపులో భాగంగా కన్యకాపరమేశ్వరి దేవస్థానానికి తీసుకువచ్చారు. 13 కిలోల వెండి, ఒక కిలో బంగారంతో భక్తులు చెన్నైలో ఈ ధనస్సు, బాణాన్ని తయారు చేయించారు. అయోధ్యకు తీసుకువెళ్లే క్రమంలో భాగంగా స్థానిక ఆలయానికి తీసుకురావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శతజయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, డాక్టర్ శేషుకుమార్, బిళ్లపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ముంపులోనే వరి పొలాలు


నీట మునిగిన పడాలపాలెంలోని వరి పంట పొలాలు

రోలుగుంట, సెప్టెంబరు 2: మండలంలోని పడాలపాలెం గ్రామంలో పంట పొలాలు నీట మునిగి చెరువుల్లా మారాయి. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా పంట పొలాలు నీట మునగడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక కొమరవోలు ఆవ నుంచి భారీగా నీరు రావడంతో సమీప పొలాలు మునిగిపోయాయి. సోమవారం కూడా ముంపులోనే ఉండడంతో తీవ్రంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

సీహెచ్‌సీకి పెరిగిన రోగుల తాకిడి

ముంచంగిపుట్టు, ఆగస్టు 2: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి పెరిగింది. వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులతో సోమవారం సీహెచ్‌సీ కిటికిటలాడింది. వైద్య సేవలు పొందేందుకు సీహెచ్‌సీకి సుమారు 258 మందికి పైగా రోగులు వచ్చారు. వారికి వైద్యులు గీతాంజలి, సంతోష్, ధరణి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సేవలను అందించారు. ప్రస్తుతం వాతావరణంలో తలెత్తిన మార్పుల కారణంగా సీహెచ్‌సీకి రోగుల తాకిడి పెరిగింది. అయితే సుమారు ఎనిమిది మంది వైద్యులు ఉండాల్సిన సీహెచ్‌సీలో, కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బందికి తలకు మించిన భారంగా మారుతోంది. అలాగే రోగులకు సైతం సకాలంలో పూర్తి స్థాయిలో వైద్య సేలు అందడం లేదు. మండలంలోని 23 పంచాయతీల పరిధిలో గల గ్రామల ప్రజలు సీహెచ్‌సీపైనే ఆధారపడి ఉన్నారు. ఫలితంగా నిత్యం సీహెచ్‌సీకి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ నేత అసభ్య పోస్ట్‌పై జన సైనికుల ఆగ్రహం


వైసీపీ ప్రతినిధి సురేశ్‌కుమార్ ఇంటి ముందు ఆందోళన చేస్తున్న జన సైనికులు

పాడేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనసేనానీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సోషల్ మీడియాలో అనుచితంగా పోస్ట్ పెట్టడంపై జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి కె.సురేశ్‌కుమార్ వైఎస్.రాజేఖరెడ్డి వర్ధంతిని ప్రస్తావిస్తూ, పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. దీనిపై జన సైనికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు కార్యకర్తలు సురేశ్‌కుమార్ ఇంటికి వెళ్లినప్పటికీ ఆయన లేకపోవడంతో అక్కడే ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ నవీన్‌కుమార్ ఆందోళనకారులకు నచ్చజెప్పి వెనక్కి పంపించి వేశారు. తమ అధినేతను అకారణంగా కించపరచడం తగదని, అటువంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా జనసైనికులు డిమాండ్ చేశారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు


చింతపల్లిలో రక్తదానం చేస్తున్న యువకులు, జనసైన నాయకులు

చింతపల్లి/కొయ్యూరు/గూడెంకొత్తవీధి/అరకులోయ/ముంచంగిపుట్టు/హుకుంపేట/పెదబయలు/డుంబ్రిగుడ/సీలేరు/అనంతగిరి, సెప్టెంబరు 2: మన్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం అభిమానులు, జనసేన పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. చింతపల్లి మండల కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 107 మంది రక్తదానం చేశారు. ఆదివాసీలకు కనీస సదుపాయాలు కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర జనసేన నాయకుడు ముక్క శ్రీనివాస్‌రావు అన్నారు. అనంతరం జనసైనికులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చక్రవర్తి, ఉల్లి సీతారామ్, వంతల బుజ్జిబాబు, ఉగ్రంగి లక్ష్మణరావు, రక్తదాన శిబిరం నిర్వాహకులు దూనబోయిన రమణ, పాల్గొన్నారు. అలాగే తాజంగి పంచాయతీ కేంద్రంలో జనసైనికులు 300 మొక్కలు నాటారు. అరకులోయలో టీడీపీ, జనసేన నాయకులు చిరంజీవి, దొన్నుదొర, పెట్టెలి దాసుబాబు ఆధ్వర్యంలో అభిమానులు పవన్ కల్యాణ్ జన్మదిన కేక్‌ను కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. ముంచంగిపుట్టులో జనసేన మండల అధ్యక్షుడు ఆర్.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో అభిమానులు, జనసైనికులు పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అంతకు ముందు నాలుగు రోడ్ల కూడలి వద్ద కేక్ కటింగ్ చేసి, భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే సీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలను అందించారు. జనసేన, టీడీపీ నాయకులు చందు, ఎం.సూర్యనారాయణ, జి.సతీష్, కుమార్, పి.మురళి, పి.నాగేష్, సాధూరాం, బాబూలాల్, ఎం.చిన్నిబాబు, బాబూజీ పాల్గొన్నారు. కొయ్యూరు జనసేన మండల అధ్యక్షుడు సాగిన బుజ్జిబాబు ఆధ్వర్యంలో జన సైనికులు పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. రాజేంద్రపాలెంలో కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. అనంతరం నిరుపేద మహిళలకు వస్త్ర దానం చేశారు. కార్యక్రమాలలో నాయకులు గూడెం లక్ష్మణ్, సాగిన బుజ్జిబాబు, సెగ్గె భావన, సాయి, జయంతి, శేషుబాబు పాల్గొన్నారు. సీలేరులో జనసేన నేత రాము ఆధ్వర్యంలో పవన్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. అనంతగిరి మండల కేంద్రంలోని జనసేన అధ్యక్షుడు చిట్టం మురళి ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లను అందజేశారు. డుంబ్రిగుడ మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రంలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు దనేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అలాగే గిరిజన యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. హుకుంపేట ఆరోగ్య కేంద్రంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే భారీ ర్యాలీ నిర్వహించి పవన్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో జనసేన నాయకులు, అభిమానులు పవన్ కల్యాణ్ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. కేట్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే జనసైనికులు ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, నాయకులు గొర్లె వీరవెంకట్, సిద్దార్థ్ మార్కె, గడుతూరి పరమేశ్, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు అండగా నిలవాలి

టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి


నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, సెప్టెంబరు 2: తుఫాన్ ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పంట, ఆస్తి నష్టాలకు గురయ్యే నియోజకవర్గ ప్రజలకు పార్టీ శ్రేణులు అండగా నిలిచి మనోధైర్యాన్ని కల్పించాలని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సూచించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు సోమవారం కుమ్మరిపుట్టులోని ఆమె నివాస గృహంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ కారణంగా పంటలు, ఆస్తి నష్టానికి గురైన వారిని గుర్తించి అండగా నిలవాలన్నారు. అధికారుల దృష్టికి నష్టాన్ని తీసుకువెళ్లి బాధితులకు పరిహారం అందేలా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతీ నాయకుడు, కార్యకర్తకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, అరకు పార్లమెంట్ నియోజకవర్గ మహిళా అధికార ప్రతినిధి డిప్పల వెంకటకుమారి, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు పోలుపర్తి గోవిందరావు, వైఎస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, జి.మాడుగుల ఎంపీపీ కళ్యాణి, పార్టీ మండల అధ్యక్షుడు కూడి రామునాయుడు, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ద జ్యోతికిరణ్, రొబ్బి రాము, నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు గబ్బాడ కుమారి, డప్పోడి వెంకటరమణ, కె.పూర్ణచందరరావు, ఎం.రమేష్, టీవీ.సత్యనారాయణ, పి.రాము, భీమన్న, పాండురాజు, పి.నాగమణి, ఎం.రామన్న, ఉషారాణి, వి.వరలక్ష్మి, పార్వతమ్మ, కె.రాజేష్, కె.కోటేశ్వరరావు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీలో ముంచంగిపుట్టు టాప్

భారీ వర్షాలు.. ఉప్పొంగుతున్న గెడ్డలు, వాగులు దాటుకుంటూ

99.6 శాతం మందికి పింఛన్ సొమ్ము అందించిన ఉద్యోగులు


పింఛన్ అందించేందుకు బిర్రుగూడ గెడ్డ దాటుతున్న కార్యదర్శి ప్రశాంత్

ముంచంగిపుట్టు, సెపెంబరు 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమంలో అత్యంత మారుమూల ముంచంగిపుట్టు మండలం పాడేరు డివిజన్‌లోలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. అల్లూరి జిల్లాలో మొదటి స్థానం రంచచోడవరం డివిజన్ పరిధిలో గల మారెడుమిల్లి నిలవగా, రెండో స్థానంలో ముంచంగిపుట్టు ఉంది. డివిజన్ స్థాయిలో టాప్‌లో నిలడంతో సిబ్బందిని సోమవారం ఎంపీడీవో కిరణ్‌కుమార్ అభినందించారు.

మండలంలోని 23 పంచాయతీల వివిధ రకాలకు సంబంధించి 6250 మంది పింఛన్‌దారులు ఉండగా, మొత్తం 6225 మందికి పింఛన్ల సొమ్మును అందించారు. అలాగే మిగిలిన పింఛన్లలో ఎక్కువ శాతం మృతి చెందిన వారివిగా ఎంపీడీవో తెలిపారు. గత కొద్ది రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలో 23 పంచాయతీల పరిధిలో పలు చోట్ల వాగులు వంకలు వదరనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అయినప్పటికీ సమయానికి పింఛన్ల సొమ్మును పింఛన్‌దారులకు అందించాలనే తపనతో సచివాలయం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు వాగులు వంకలు, గెడ్డలు దాటుతూ 99.6 శాతం పింఛన్ సొమ్ము పంపిణీ పూర్తి చేశారు. దీంతో వారిని ఎంపీడీవో కిరణ్‌కుమార్ అభినందించారు. అలాగే లక్ష్మీపురం పంచాయతీ బిర్రుగూడ, ఉబ్బెంగుల, కర్లాపొదర్, ముంతగుమ్మి తదితర ప్రాంతాల్లో గెడ్డలు వరదనీటితో ఉధృతంగా ప్రహిస్తున్నప్పటికీ గెడ్డలు దాటుతూ మారుమూల గ్రామాలకు వెళ్లి ఇంటింటికి తిరిగి పింఛన్ సొమ్మును పింఛన్‌దారులకు అందించిన సచివాలయంలుద్యోగులు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌లను ఎంపీడీవో ప్రశంసిచారు.

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు పట్టివేత

పోలీసులకు అప్పగించిన గిరిజనులు.. కేసు నమోదు


అక్రమ వసూళ్లకు పాల్పడుతూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు వీరే

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 2: ఫారెస్ట్... పోలీసు... స్వచ్ఛంద సంస్థ.. ఇలా తదితర పేర్లతో మండలంలోని పలు చోట్ల అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను గిరిజనులు పట్టుకున్నారు. వారిని సోమవారం పోలీసుకు అప్పగించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

మండల పరిధిలోని పలు వసతి గృహాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి ఒకొక్కరి వద్ద ఒక్కో శాఖల పేర్లను చెప్పి సేవా కార్యక్రమాలను చేసేందుకు డబ్బులు సేకరిస్తున్నట్టు నమ్మబలికి ఇద్దరు వ్యక్తులు రూ.2 వేలు నుంచి రూ.3 వేల చొప్పున అక్రమ వాసూళ్లకు పాల్పడ్డారు. అలాగే మండల కేంద్రం వైపు వచ్చే వాహనాలను మార్గమధ్యంలో అడ్డగించి పోలీసుల పేరుతో భయపెట్టి డబ్బులను వసూలు చేశారు. అయితే మండల కేంద్రం వైపు వస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ భర్త జేవీవీఎస్ మూర్తిని కుజభంగి సమీపంలో వాహనం ఆపి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో అతనికి అనుమానం వచ్చి గట్టిగా నిలదీయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. వారిద్దరూ నకిలీ పోలీసులుగా గుర్తించి స్థానికుల సహాయంతో పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు అప్పగించారు.

ఎస్ఐ కె.రవీంద్ర వారిని విచారణ చేయగా విశాఖపట్నంలోని ఆరిలోవ ప్రాంతానికి చెందిన బొత్స యువరాజు, మండపల్లి రాజారత్నంగా గుర్తించారు. వారి వద్ద సేవ్ హ్యూమానిటీ వెల్ఫేర్ సొసైటీ పేరుతో గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లు ఉన్నాయని, కానీ అతి ఆశతో దారి మార్చి పోలీసులు, ఫారెస్టు అధికారుల పేరుతో అక్రమ వసూలకు పూనుకున్నారని విచారణలో తేలిందని ఎస్ఐ చెప్పారు. ఇద్దరు వ్యక్తులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

వైసీపీని వీడేది లేదు

పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి, సెప్టెంబరు 2: వైసీపీని వీడేది లేదని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు తనను పార్టీలో చేర్చుకోవాలని డబ్బులు ఎరగా వేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా పాడేరు, అరకు నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నారనే విషయం కార్యకర్తలు మర్చిపోరాదన్నారు. స్థానిక సర్పంచ్, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులతోనే ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్, అధికారులను కోరామన్నారు. ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి కూటమి నాయకులతో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశామన్నారు. సమావేశంలో ఎంపీపీలు కోరాబు అనుషదేవి, బోయిన కుమారి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, రెండు మండలాల వైసీపీ మండల అధ్యక్షులు మోరి రవి, బొబ్బిలి కామేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళులు

కొయ్యూరు/చింతపల్లి/సీలేరు/హుకుంపేట, సెప్టెంబరు 2: మన్యంలోని పలు మండలాల్లో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. కొయ్యూరు మండలంలోని నల్లగొండ గ్రామంలో ఎంపీపీ బడుగు రమేష్‌బాబు ఆధ్వర్యంలో వైసీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు , మహిళా నేత రాజులమ్మ సమక్షంలో పలువురు సర్పంచ్‌లు, నేతలు వైఎస్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు పాల్గొన్నారు.


కొయ్యూరు మండలంలోని నల్లగొండ గ్రామంలో రాజశేఖరరెడ్డి విగ్రహం ముందు నివాళి అర్పిస్తున్న నాయకులు

చింతపల్లి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని పాత బస్ స్టాండ్‌లో కార్యకర్తలు, నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కోరాబు అనుషదేవి మాట్లాడుతూ దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి సేవలు ఎన్నడూ మర్చిపోలేమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, పార్టీ మండలాధ్యక్షుడు మోరి రవి, సర్పంచ్ పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, సీనియర్ నాయకుడు జల్లి సుధాకర్ పాల్గొన్నారు. జీకే వీధి మండలం సీలేరులో సోమవారం దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సీలేరు సర్పంచ్ పి.దుర్గో, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక రామాలయం సెంటర్ వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గణేష్, బుజ్జి, మైలపల్లి సత్తిబాబు, స్వర్ణలత తదితర్లు పాల్గొన్నారు. హుకుంపేట మండంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జి.జానకిరావు అధ్వర్యంలోని మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రామలింగం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎంగా రాజశేఖర్‌రెడ్డి అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పచ్ క్రిష్ణారావు, పార్టీ నేత సాధు తదితరులు పాల్గొన్నారు.


చింతపల్లిలో వైఎస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

అటకెక్కిన ఆశ్రమాల నిర్వహణ

...5వ పేజీ తరువాయి


అనంతగిరి బాలికల ఆశ్రమ పాఠశాల- 2లో ఆరుబయట భోజనాలు చేస్తున్న బాలికలు

అధికారులు తయారయ్యారు. దీంతో ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ గిరిజన విద్యార్థులకు అరకొరగా భోజనాలు పెట్టడం, సదుపాయాలు సమకూర్చక పోవడం మామూలైపోయింది. ఈ కారణాలతో గిరిజన విద్యార్థులు అనారోగ్యం పాలవడం, పలుమార్లు ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్పష్టమవుతున్నది.

హైకోర్టు ఉత్తర్వులను అనుకూలంగా మలచుకుని..

ఆశ్రమ పాఠశాలల్లోకి ఇతరుల ప్రవేశాన్ని నిషేధించాలని హైకోర్టు ఒక సందర్భంలో ఇచ్చిన ఉత్తర్వులను సైతం గిరిజన సంక్షేమ విద్యాశాఖాధికారులు, ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు, వార్డెన్లు తమకు అనుకూలంగా మలచుకున్నారు. దీంతో ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలపై విద్యార్థి, ప్రజాసంఘాలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, విలేకరులు సైతం దృష్టిపెట్టలేని పరిస్థితిని ఏర్పరచి, ఇష్టారాజ్యంగా ఆశ్రమ పాఠశాలల నిర్వహణ చేస్తున్నారు. ఒక వైపు అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, మరో వైపు సంఘాలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు సైతం ఆశ్రమ పాఠశాలలపై దృష్టిపెట్టని పరిస్థితులు ఏర్పడడంతో అవి మరింత అధ్వానంగా మారాయి. ఈ పరిణామాల వల్లే ఇటీవల డుంబ్రిగుడ మండలం జాముగూడలో పదుల సంఖ్యలో గిరిజన బాలికలు ఆహార కలుషితంతో ఇబ్బందులు పడ్డారు. తాజాగా జి.మాడుగుల మండలం బందవీధి ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు గిరిజన బాలికలు ఐదు రోజులుగా అదృశ్యమైనా హెచ్‌ఎం, మేట్రన్ కనీసం పట్టించుకోని ఘటన చోటుచేసుకుంది. ఇవి ఉదాహరణలు మాత్రమే.. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనేక సమస్యలు, ఇబ్బందుల నడుమ విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను మెరుగుపరిచేందుకు, గిరిజన విద్యార్థులకు చక్కని విద్యనందించేందుకు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

జడ్పీ సీఈవో పోస్టుకు పోటీ

... 5వ పేజీ తరువాయి

ఎంపీడీవోలకు స్థానచలనం ఉంటుందని, అందుకు తగినట్టుగానే పలువురు ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తీసుకున్నారని సమా చారం. గత ప్రభుత్వంలో కీలక మండలాల్లో పనిచేసిన ఎంపీడీవోలు అప్పటి వైసీపీ నాయకులతో అంటకాగారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వారంతా కూటమి నేతల చుట్టు తిరుగుతూ తామంతా అనుకూలంగా పనిచేస్తామని నమ్మబలుకుతున్నారు. నగర పరిసరాలు, మైదానంలో జాతీయ రహదారికి ఆనుకుని మండలాల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని విధిగా ఏజెన్సీకి బదిలీ చేయాలని, అక్కడి ఎంపీడీవోలు కోరుతున్నారు. దీంతో వారికి మైదానంలో అవకాశం దొరుకుతుందని అభిప్రాయపడుతున్నారు.

గిరిజన బాలికల అదృశ్యంపై ఐటీడీఏ పీవో సీరియస్

...5వ పేజీ తరువాయి

జూనియర్ అసిస్టెంట్ ఎస్.శేషగిరిరావుపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని జి.మాడుగుల ఎస్ఐ శ్రీనివాసరావుకు ఐటీడీఏ పీవో ఆదేశించారు. అలాగే ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు, జి.మాడుగుల ఏటీడబ్ల్యూవో తిరుపాల్‌ను ఐటీడీఏ పీవో మందలించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను హెచ్చరించారు.

సంక్షిప్తంగా..

కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన సబ్‌కలెక్టర్ కల్పశ్రీ



పాడేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియమితులైన 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కల్పశ్రీ కలెక్టర్ దినేశ్ కుమార్‌ను సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో ఆమె కలెక్టర్‌ను కలిసి మొక్కను అందించారు. ఈ సందర్భంగా ఆమెకు కలెక్టర్ దినేశ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

మారుమూల గ్రామాల అభివృద్ధి కృషి: ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి, సెప్టెంబరు 2: మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని కొండిబ పంచాయతీ కపటివలస, అంబోటిమామిడి, రంగసీవలస, బల్యగుడ, బల్లమామిడి, కోసమామిడి గ్రామాలను కలుపుకుంటూ గతంలో నిర్మించిన మట్టి రోడ్డును సోమవారం ఆయన పరిశీలించారు. వర్షాలకు పూర్తిగా కోతకు గురై, అధ్వానంగా మారడంతో అత్యవసర పరిస్థితిల్లో గిరిజనులకు డోలీమోతపై తరలించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం వద్ద గిరిజనులు వాపోయారు. మారుమూల గ్రామాల అభివృద్ధి కృషిచేస్తూ, పూర్తిస్థాయిలో రహదారులు నిర్మాణానికి చర్యలు చేపడతానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, వైసీపీ మండల అధ్యక్షుడు స్వామి, సర్పంచ్ అప్పారావు, నాయకులు సూర్యానారయణ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

బందవీధిలో జన్‌మన్ గ్రామసభ

చింతపల్లి, సెప్టెంబరు 2: మండలంలోని పెదవలస పంచాయతీ బందవీధి గ్రామంలో సర్పంచ్ వంశీ కృష్ణ అధ్యక్షతన సోమవారం పీఎం జన్‌మన్ గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఏఈఈ కిముడు జ్యోతిబాబు మాట్లాడుతూ పీవీటీసీ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. సీసీ రోడ్లు, రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్యుత్, విద్య వైద్యం, పక్కా గృహాల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.బాలకృష్ణ, గిరిజనులు పాల్గొన్నారు.

రోడ్లపై విడిచిన పశువులు స్వాధీనం

పాడేరు రూరల్, సెప్టెంబరు 2: జిల్లా కేంద్రం పాడేరులోని ప్రధాన రహదారిపై నిర్లక్ష్యంగా విడిచిపెట్టిన పశువులను సోమవారం పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు ఎంపీడీవో కె.సాయి నవీన్ తెలిపారు. పట్టణంలో పశువులను నిర్లక్ష్యంగా విడిచిపెట్టడంతో రహదారిలో సంచరించడం, రాత్రి సమయంలో రోడ్లపైనే పడుకోవడం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. దీంతో ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్.రమేష్ పర్యవేక్షణలో సోమవారం మేజర్ పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు వాటిని స్వాధీనం చేసుకొని పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఉంచినట్టు ఆయన తెలిపారు. యజమానులు పంచాయతీ కార్యాలయానికి వస్తే జరిమానా విధించి పశువులను అప్పగిస్తారన్నారు. ఇకపై పశువులను రోడ్లపై విడిచిపెడితే స్వాధీనం చేసుకొని వేలం వేస్తామని ఎంపీడీవోహెచ్చరించారు.

ప్రసవానికి 15 రోజులు ముందుగానే ఆస్పత్రిలో చేరాలి

అనంతగిరి, సెప్టెంబరు 2: భారీ వర్షాల కారణంగా ప్రసవాలకు 15 రోజులుగా ముందుగానే ఆస్పత్రిలో చేరాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ సాధన తెలిపారు. మండలంలోని మారుమూల పినకోట పీహెచ్‌సీ పరిధిలో గల కొర్రపర్తి, దిబ్బలపాలెం గ్రామాల్లో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం పినకోట పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ప్రసవ సమయానికి 15 రోజులు ముందుగానే గర్భిణిలను బర్త్‌వెయిటింగ్ తరలించి, ప్రసవం వరకు సేవలను అందించాలని, సుఖ ప్రసవం పొందేలా కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. భారీ వర్షాలకు కారణంగా సిబ్బంది అప్రమ్తంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలోని వైద్యాధికారి డి.రూప్ చంద్, హెల్త్ ఎడ్యుకేటర్ రవిశర్మ, సిబ్బంది సింహచలం, అశ్విని, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు ఇల్లు నేలమట్టం


నేలమట్టమైన ఇంటి వద్ద దీనావస్థలో ఉన్న బాధితులు

కొయ్యూరు, సెప్టెంబరు 2: మండలంలో మఠంభీమవరం పంచాయతీ దబ్బకోట గ్రామానికి చెందిన గొల్లోరి శంకరరావుకు చెందిన పెంకుటిల్లు సోమవారం నేలకూలింది. ఇంటి గోడలు నానిపోయి సమూలంగా నేలకూలటంతో బాధిత కుటుంబీకులు నిరాశ్రయులయ్యారు. ఇంటిలో ఉన్న గృహోపకరణాలు, తిండి గింజలతో పాటు సర్వస్వం మట్టిలో కలిశాయని, ప్రభుత్వం ఆదుకుని శాశ్వత గృహ నిర్మాణానికి సహకరించాలని బాధితులు కోరారు.

గంజాయి రవాణా నివారణకు విస్తృతంగా తనిఖీలు

చింతపల్లి, సెప్టెంబరు 2: గంజాయి రవాణా నివారణకు పోలీసులు తనిఖీలను విస్తృతం చేశారు. మండల కేంద్రంలోని అంతర్ల, హనుమాన్ జంక్షన్, ఏపీఆర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసులు జాగిలాలతో వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. గంజాయి సాగు, రవాణను పూర్తి స్థాయిలో కట్టడి చేయాలని పోలీసు అధికారులకు ఆదేశాలు వచ్చాయి. దీంతో పోలీసులు గంజాయి రవాణను అడ్డుకునేందుకు 24 గంటలు ప్రధాన కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్నారు. కాగా, గతంలో మావోయిస్టుల వారోత్సవాలు, విధ్వంస సంఘటనలు జరిగిన సమయంలోనే ఇలా తనిఖీలు చేసేవారు.